RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, ఏప్రిల్ 12, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 12 | పేజీలు: 8 | వెల : రూ.1



**ఇంటర్ ఫలితాల విషాదం: ఫెయిలయ్యామని ఆరుగురు విద్యార్థుల ఆత్మహత్య**

## ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతిపై సీఎం రేవంత్ విచారం..





హైదరాబాద్, ఏప్రిల్ 12: ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆదివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఆశా భోంస్లే మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. ఆశా కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆశా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని అన్నారు. లెజెండరీ గాయని ఆశా భోంస్లే మరణంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆశా భోంస్లే మరణం కేవలం సినీ రంగానికే కాకుండా, యావత్ సంగీత ప్రపంచానికి తీరని లోటన్నారు. ఏడు దశాబ్దాలకు పైగా వేల సంఖ్యలో పాటలు పాడి.. సంగీత ప్రియులను అలరించిన ఆమె గొంతు అమరం అంటూ కీర్తించారు. ఆశా భోంస్లే శాస్త్రీయ సంగీతం నుంచి పాప్ సాంగ్స్ వరకు, అన్ని భాషల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప గాయని అన్నారు. సంగీత రంగంలో ఆమె సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమెను 'దాదాసాహెబ్ ఫాల్కే', 'పద్మ విభూషణ్' వంటి అత్యున్నత పురస్కారాలతో గౌరవించిందని గుర్తు చేశారు..



**హర్మూజ్ జలసంధిలో తీవ్ర ఉద్రిక్తత.. ఇరాన్‌ను చుట్టుముట్టిన అమెరికా**



## రాష్ట్రంలో కాంగ్రెస్ "దోచుకో-దాచుకో" పథకం: కేటీఆర్

మంచిర్యాల జిల్లా, ప్రతినిధి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ "దోచుకో-దాచుకో" అనే పథకాన్ని అమలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను సన్మానించిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అవినీతిమయం అయిందని, రాష్ట్రంలో ప్రతి పథకంలో భారీ దోపిడీ జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడని తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేటీఆర్, సింగరేణి నుంచి కేంద్ర ప్రభుత్వ పథకాల వరకు ఎక్కడా విచారణ జరగడం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి "తోడు దొంగల"లా

(మిగతా 2వ పేజీలో)

## పుంజుకుంటున్న టీవీకే పార్టీ



**చెన్నై, ఏప్రిల్ 12, (వాయిస్ టుడే )**

తమిళనాట టీవీకే పార్టీ ఎఫెక్ట్ రెండు ప్రధాన పార్టీలకు గట్టిగానే తగిలేట్టు ఉంది. తొలిసారి బరిలో ఉన్న దళపతి విజయ్‌కు ఏమాత్రం కలిసి వస్తుంది అన్నది అలా ఉంచితే, ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నా డీఎంకేలకు మాత్రం గట్టి దెబ్బ తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సర్వేలు తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు తప్పదని సూచిస్తున్నాయి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు కొత్తగా పార్టీ విజయ్ వైపు వెళితే, అది అన్నాడీఎంకేకు కలిసి రావాలి.. కానీ తమిళనాట అది జరుగుతుందా అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. దీంతో ఇటు ఏఐడీఎంకే, అటు అధికార డీఎంకే రెండు పార్టీలను గుబులు పట్టుకుంది. చెన్నై మహానగరంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇవన్నీ దశాబ్దాలుగా డీఎంకే పార్టీకి కంచుకోటగా ఉంటున్నాయి. చెన్నై తోపాటు తిరువల్లూరు కాంచీపురం చెంగల్పట్టు జిల్లాలో కూడా డీఎంకేకు మంచి పట్టు ఉంది. ఈసారి డీఎంకే కూటమి ఏర్పాటు చేసి ఎన్నికల్లో వెళ్లిన ప్రతి సందర్భంలోనూ డీఎంకే పోటీ చేసే స్థానాలు కూడా ఈ ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ స్థానాలు, ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఆ పార్టీకి బలంగా నిలుస్తున్న ప్రాంతాలు కూడా ఈ జిల్లాలోని ఎక్కువగా ఉండడం అనేకసార్లు రుజువైంది. తాజాగా విజయ్ పార్టీ పెట్టడం విజయ్ స్వతహాగా క్రిస్టియన్ కావడం క్రిస్టియన్ మైనారిటీ ఓట్లన్నీ ఎక్కువగా విజయ్ వైపు వచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే డీఎంకే ఓటు బ్యాంకును భారీగా గండి కొట్టడం జరుగుతుందన్న టాక్ బలంగా ఉంది. దీంతో డీఎంకేకు వచ్చే సీట్లపై విజయ్ ఎఫెక్ట్ పడుతుందన్న మాట వినబడుతుంది. అలా అని అక్కడ విజయ్ గెలిచే అవకాశాలు కూడా తక్కువే ఓట్ల చీలిక ఎక్కువగా ఉంటే అది అన్న డీఎంకే పార్టీకి తెచ్చి అవకాశం ఉందన్న అభిప్రాయం ఉంది.ఇక దక్షిణ తమిళనాడు, ఎడపాటి పలనీ స్వామి సొంత ప్రాంతమైన కొంగునాడు ప్రాంతంలో అన్న డీఎంకేకు మంచి పట్టు ఉంది. అక్కడ విజయ్ పార్టీ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అన్నా డీఎంకే కు బలమైన బలమైన సామాజిక వర్గంగా ఉన్న దేవర్ సామాజిక వర్గం నుంచి కీలక నేతలు టీవీకె పార్టీలోకి వెళ్లారు. దీంతో ఆ ప్రాంతంలో భారీగా ఓట్లు విజయ్ చీల్చే అవకాశం ఉంది.. ఇక్కడ ఏఐడిఎంకెకి నష్టం జరిగితే డీఎంకే కేకు లాభం చేకూరి అవకాశం ఉందన్న టాక్ ఉంది.!ఇదిలావుంటే, కరూర్ ట్రాజెడీ

(మిగతా 2వ పేజీలో)



## జీవన్ రెడ్డి రాకతో కారు గేరు మారేనా?

హైదరాబాద్ : గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ తో తన నలభై ఏళ్ల బంధాన్ని తెంచుకుని మరీ బీఆర్ఎస్ గూటికి చేరువవుతున్నారు. తెలంగాణ సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి. అందులో భాగంగా శుక్రవారం ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఈ దృశ్యాలను చూసిన వారంతా..జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్ దశ మారుతుందా? అన్న దిశగా విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుతం కొత్త జిల్లా కేంద్రంగా కొనసాగుతున్న జగిత్యాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జీవన్ రెడ్డి పేరుకు సీనియర్ మోస్ట్ నేత కిందే లెక్క. కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఏకంగా 14 బీఫారాలను అందించింది. అయితే ఆయన 14 సార్లు విజయం సాధించలేదు. కేవలం ఆరు సార్లు మాత్రమే గెలిచారు. మిగిలిన పర్యాయాల్లో ఆయన ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లోనూ ఆయన కొత్తగా వచ్చిన సంజయ్ కుమార్ చేతిలో ఓడిపోయారు.నాడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేయగా,బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన సంజయ్ చేతిలో ఓడిపోయారు. అంటే,మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించిన సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ

(మిగతా 2వ పేజీలో)

## జగిత్యాల తర్వాత జనంలోకి కేసీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 12, (వాయిస్ టుడే )**



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరలో మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రానున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం లో బీఆర్ఎస్ నేతలు కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ ఆయనతో భేటీ అయ్యారు. అనంత రం ఫామ్‌హౌస్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. ఈనెల 20వ తేదీ లోపే మాజీమంత్రి జీవన్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ సమ క్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు.ఈ మేరకు కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలిసి వెళ్లినట్లు తెలిపారు. జగిత్యాలలో భారీ బహి రంగ సభలో ఈ చేరికలు జరగనున్నాయని, రాష్ట్రంలో రైతు సమస్యలు, ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ ఈ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్లీనరీకి ముందే మరిన్ని చేరికలు ఉంటా యన్నారు. కేసీఆర్‌తో కలిసి పనిచేయడానికి జీవన్‌రెడ్డి ముందుకు వచ్చారని, ఆయనకు పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.'అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. -బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో ఎర్రవెల్లి నివాసంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఎర్రవెల్లి నివా సానికి చేరుకున్న జీవన్‌రెడ్డికి వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు పుష్పగుచ్ఛాలందించి సాదరంగా ఆహ్వానించారు.కేసీఆర్‌తో కలిసిన సంద ర్భంలో జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. నిరంతరం తన నియోజకవర్గం, జిల్లా ప్రజలు, రైతుల గురించి ఆలోచన చేసే రైతు నాయకుడు, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే మాజీ మంత్రి జీవన్ రెడ్డి., తెలంగాణ సాధకుడు, రైతు బాంధవుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కలయిక సందర్భంగా భావోద్వేగ వాతావరణం నెలకొంది... 'తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవ సరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు.. అన్నా. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాల్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది అన్నా..' అంటూ తన మనసులోని మాటను భావోద్వేగంతో వ్యక్తం చేశారు. జీవన్‌రెడ్డిని అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్ హృద యపూర్వకంగా ఆలింగనం చేసుకొని, దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. కాసేపు ఇష్టాగోష్టి తర్వాత జీవన్‌రెడ్డి బృందాన్ని

(మిగతా 2వ పేజీలో)

## ఇరాన్ చర్చలకు రాకున్నా పర్లేదు: ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో, ఇరాన్ తిరిగి చర్చలకు వచ్చినా, రాకపోయినా తనకు ఎలాంటి పట్టింపు లేదని స్పష్టం చేశారు. ఫ్లోరిడా పర్యటన ముగించుకుని మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆంద్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చర్చల సందర్భంగా ఇరాన్‌కు అణ్వాయుధంపై ఉన్న ఆసక్తి మరోసారి బయటపడిందని ట్రంప్ ఆరోపించారు. "వారికి ఇంకా అణ్వాయుధం కావాలి. ఆ విషయాన్ని వాళ్లు స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండటానికి వీల్లేదు" అని ఆయన గట్టిగా చెప్పారు. చర్చలు జరుగుతున్నప్పుడే ట్రంప్.. ఒప్పందం కుదిరినా కుదరకపోయినా అమెరికాకే విజయమని వ్యాఖ్యానించడం గమనార్హం. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో వారాంతంలో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య కాల్పుల విరమణపై ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం ఈ చర్చల్లో పాల్గొంది. అయితే, దాదాపు 21 గంటల పాటు జరిగిన ఈ సమావేశాలు ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయడానికి నిరాకరించడమే చర్చల వైఫల్యానికి కారణమని అమెరికా వర్గాలు తెలిపాయి. చర్చలు విఫలమైన వెంటనే, అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. హర్మూజ్ జలసంధి నుంచి రాకపోకలు సాగించే ఇరాన్ నౌకలపై నౌకా దిగ్బంధనం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ గడువు ఏప్రిల్ 22తో ముగియనుంది.

# హర్మూజ్ జలసంధిలో తీవ్ర ఉద్రిక్తత.. ఇరాన్‌ను చుట్టుముట్టిన అమెరికా

ఇరాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ ఓడరేవులపై పూర్తిస్థాయి దిగ్బంధనాన్ని అమలు చేయనున్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. సోమవారం, ఏప్రిల్ 13న తూర్పు కాలమానం ప్రకారం ఉదయం 10 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30) ఈ దిగ్బంధనం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇరాన్‌కు చెందిన అరేబియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని తీర ప్రాంతాలు, ఓడరేవులకు వచ్చే లేదా వెళ్లే ఏ దేశ నౌకనైనా అడ్డుకుంటామని సెంట్రల్ కమాండ్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొంది. అయితే, హర్మూజ్ జలసంధి గుండా ఇతర దేశాల ఓడరేవులకు వెళ్లే నౌకల స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలిగించబోమని స్పష్టం చేసింది. అమెరికా ఆంక్షలను తప్పించుకుంటూ చైనా యువాన్ల రూపంలో చెల్లింపులు జరుపుతున్న నౌకలను నిరోధించడమే ఈ దిగ్బంధనం వెనుక అసలు ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా దిగ్బంధనంపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ తీవ్రంగా స్పందించారు. ఈ చర్యతో అమెరికా వినియోగదారులకు ఇంధన ధరలు భారీగా పెరగనున్నాయని డొనాల్డ్ ట్రంప్‌ను హెచ్చరించారు. "ప్రస్తుత పంపు ధరలను ఆస్వాదించండి. మా దిగ్బంధనంతో త్వరలోనే మీరు 4-5 డాలర్ల గ్యాస్ ధరలను గుర్తుచేసుకుని బాధపడతారు" అని ఆయన ఎక్స్‌లో వ్యంగ్యంగా పోస్ట్ చేశారు. ఇదిలావుండగా, ఇటీవల హర్మూజ్ జలసంధిలో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. తమ హెచ్చరికలతో రెండు అమెరికా యుద్ధనౌకలను వెనక్కి పంపించామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. అయితే ఈ వాదనను యూఎస్




సెంట్రల్ కమాండ్ ఖండించింది. తమ యుద్ధనౌకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ ప్రయాణాన్ని పూర్తి చేశాయని తెలిపింది. ఈ తాజా దిగ్బంధనం ఇరాన్, చైనాలతో అమెరికాకు ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది. ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే, ముడిచమురు ధరలు పెరిగి ప్రపంచ ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

# ఇంటర్ ఫలితాల విషాదం: ఫెయిలయ్యామని ఆరుగురు విద్యార్థుల ఆత్మహత్య



తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన వేళ తీవ్ర విషాదాలు చోటుచేసుకున్నాయి. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనే మనస్తాపంతో రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. మెదక్, సూర్యాపేట, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఈ దారుణ ఘటనలు జరిగాయి. ఆదివారం ఫలితాలు వెలువడిన తర్వాత ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మెదక్ జిల్లాకు చెందిన చాకలి సాయిరాం (16) రెండు సబ్జెక్టుల్లో, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జూలపల్లి సౌజన్య (17) రెండు సబ్జెక్టుల్లో, మహబూబ్‌నగర్‌కు చెందిన జక్కుల శ్రావణి రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఇళ్లలోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సూర్యాపేట జిల్లాకు చెందిన యడ్ల సౌజన్య (16) జువాలజీలో ఫెయిల్ కావడంతో బాత్రూంలో ఉరేసుకుంది. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన కోయడ కల్యాణి బేగం (16) నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో, "గుడ్ బై, నా ఇంటర్ రిజల్ట్ చూడొద్దు" అని సోదరుడికి మెసేజ్ పంపి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనల్లో ఓ విద్యార్థి కథనం మరింత హృదయవిదారకంగా ఉంది. ఖమ్మం జిల్లాకు చెందిన గంగదేవుల అక్షంత్ (17) పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఫలితాలు రాకముందే రెండు రోజుల క్రితం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, ఆదివారం విడుదలైన ఫలితాల్లో అతను 347 మార్కులతో ఫస్ట్ క్లాస్‌లో పాసైనట్లు తేలింది. ఆన్‌లైన్‌లో కుమారుడి మార్కులు చూసిన అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

# విజయ్ 'జన నాయగన్' లీక్ కేసు.. ఆరుగురి అరెస్ట్

ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాల లీకేజీ కేసులో కీలక పురోగతి లభించింది. ఈ కేసులో ఆరుగురు వ్యక్తులను తమిళనాడు సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం రెండు రోజుల క్రితమే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కావడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. రూ.500 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు లీక్ కావడంపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ పైరసీ వెనుక 21 మంది హస్తం ఉందని ఆరోపిస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆదివారం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ లీక్ నిర్మాణ సంస్థ నుంచే జరిగిందా లేక బయటి నుంచి హ్యాకింగ్ ద్వారా జరిగిందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. 'జన నాయగన్' చిత్రం విడుదలకు ముందే సెన్సార్ వివాదాల్లో చిక్కుకుంది. ఇందులో రాజకీయంగా సున్నితమైన అంశాలు, వివాదాస్పద సన్నివేశాలు ఉన్నాయని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) పలు అభ్యంతరాలు లేవనెత్తడంతో సినిమా విడుదల నిలిచిపోయింది. ఈ నేపథ్యంలోనే సినిమా లీక్ కావడం నిర్మాతలకు మరింత నష్టాన్ని మిగిల్చింది. ప్రస్తుతం ఈ లీక్ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో, పైరసీ లింకులను వెంటనే తొలగించాలని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించారు.





# శ్రీవారి భక్తులకు గమనిక... జులై నెల టికెట్ల షెడ్యూల్ విడుదల

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. 2026 జులై నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటా విడుదల తేదీలను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకునేందుకు వీలుగా, ఏప్రిల్ 18 నుంచి దశలవారీగా ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

**విడుదలయ్యే టికెట్లు, తేదీల వారీగా వివరాలు:**

ఏప్రిల్ 18: ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భక్తులు ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

ఏప్రిల్ 21: ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను భక్తులు నేరుగా బుక్ చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు.

ఏప్రిల్ 23: ఈ రోజు మూడు వేర్వేరు సమయాల్లో టోకెన్లు విడుదలవుతాయి.

ఉదయం 10 గంటలకు: అంగప్రదక్షిణ టోకెన్లు.

ఉదయం 11 గంటలకు: శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు.

మధ్యాహ్నం 3 గంటలకు: వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లు.

ఏప్రిల్ 24: భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు.

# లాయర్ హరిప్రసాద్ హత్య కేసును ఛేదించిన పల్నాడు పోలీసులు... నిందితుల అరెస్ట్



పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన యువ న్యాయవాది శ్రీరామ హరిప్రసాద్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు పాల్పడింది మరెవరో కాదు, మృతుడి తోడల్లుడు, నరసరావుపేటలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట కోటయ్య అని తేల్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు నిర్ధారించి, అతడిని, మరో నిందితుడిని అరెస్టు చేశారు. రక్షించాల్సిన పోలీసు సిబ్బందే ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా తేలడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీరామ హరిప్రసాద్ (37) ఒంగోలులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం (ఏప్రిల్ 10) తెల్లవారుజామున చిలకలూరిపేట మండలం యడవల్లి సమీపంలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఆయన స్కూటీ మృతదేహంపై పడి ఉండటంతో, తొలుత ఇది రోడ్డు ప్రమాదంగా అందరూ భావించారు. అయితే, ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అనుమానాలు తలెత్తాయి. మృతుడి తల వెనుక భాగంలో బలమైన గాయం ఉండటంతో ఇది ప్రమాదం కాదని, హత్యేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. లోతుగా దర్యాప్తు చేపట్టగా, హత్యకు ముందు నిందితులు మద్యం కొనుగోలు చేసినప్పుడు జరిపిన ఒక ఫోన్‌పే లావాదేవీ కీలక ఆధారంగా మారింది. ఈ ట్రాన్సాక్షన్ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. మృతుడు హరిప్రసాద్ భార్య, నిందితుడు కానిస్టేబుల్ వెంకట కోటయ్య భార్య అక్కాచెల్లెళ్ల కూతుళ్లు. హరిప్రసాద్ తరచూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని నాగజ్యోతి తన సోదరి భర్త వెంకట కోటయ్యతో చెప్పుకుని బాధపడేది. తన మరదలి కష్టాలు చూడలేక, హరిప్రసాద్‌ను అడ్డు తొలగించాలని కానిస్టేబుల్ కోటయ్య నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం తన స్నేహితుడైన శ్రీనివాసరావుతో కలిసి పక్కా ప్రణాళిక రచించాడు. గురువారం రాత్రి 'పార్టీ చేసుకుందాం రా' అని నమ్మించి హరిప్రసాద్‌ను నరసరావుపేటకు పిలిపించారు. కోటప్పకొండ రోడ్డులోని ఓ హోటల్‌లో ముగ్గురూ కలిసి అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. హరిప్రసాద్‌కు పూర్తిగా మత్తు ఎక్కాక, యడవల్లి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బండరాయితో తలపై బలంగా మోది దారుణంగా హత్య చేశారు. అనంతరం దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంపై స్కూటీని పడేశారు. అయితే పోలీసుల దర్యాప్తుతో అసలు నిజం బయటపడింది. పోలీసులు కానిస్టేబుల్ వెంకట కోటయ్య, అతని స్నేహితుడు శ్రీనివాసరావును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ "దోచుకో-దాచుకో" పథకం: కేటీఆర్

వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా ఆయన మండిపడ్డారు. ప్రధానమంత్రి, హోంమంత్రి అవినీతి ఆరోపణలు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పరం ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని ఆరోపించారు. సింగరేణి కుంభకోణంపై మాట్లాడుతూ వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉందని అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే ప్రతి బొగ్గు గనిపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన ప్రజలకు, పార్టీ కౌన్సిలర్లకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని కేసులు, ఒత్తిళ్లు వచ్చినా కౌన్సిలర్లు తలొగ్గలేదని అభినందించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ అధికారంలోకి రావాలని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, రైతులు, మహిళలు, విద్యార్థులు మోసపోయారని అన్నారు. సింగరేణి ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే బీఆర్ఎస్ తరఫున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# పుంజుకుంటున్న టీవీకే పార్టీ

ఇప్పటికీ కాగుతూనే ఉంది.. చివరి సినిమా అనుకున్న జననాయగన్ థియేటర్ల గేటు బైటే ఆగిపోయింది. త్రిషతో రిలేషన్ భార్యతో విడాకుల కేసుకు దారితీసింది. ఇక నామినేషన్ నుంచి ప్రచారానికి పర్మిషన్ వరకూ ప్రతిసారీ దెబ్బమీద దెబ్బ పడి దళపతిని ఆడుకుంటూనే ఉంది. రాజకీయాల్లో అనుభవం లేకపోవడం వల్లే ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయని కొంతమంది చెబుతుంటే.. ఇలాంటి వివాదాలతో మీడియా దృష్టిని ఆకర్షించే ప్రయత్నం జరుగుతోందంటున్నారు మరికొందరు.

# జీవన్ రెడ్డి రాకతో కారు గేరు మారేనా?

అక్కున చేర్చుకుంటే..ఓడిన జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ ఆశ్రయంగా మారుతోంది. ఇక జీవన్ రెడ్డి బలగం విషయానికి వస్తే తన నియోజకవర్గంలో తనను తాను గెలిపించుకునే పరిస్థితి లేని జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్ ఏం లబ్ధి పొందుతుందని చాలా మంది విశ్లేషిస్తున్నారు. అంతేకాకుండా కావడానికి సీనియర్ నేతే అయినా జీవన్ రెడ్డి ఇప్పటి కొత్త తరం నేతలతో పోటీ పడే సత్తా లేదన్న రీతిలోనూ ఆసక్తికర విశ్లేషణలు సాగుతున్నాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవన్‌రెడ్డికి అత్యధిక ప్రాధాన్యం దక్కింది. వైఎస్ కు ఉన్న అత్యంత సన్నిహితుల జాబితాలో జీవన్ రెడ్డి కూడా ఒకరని చెప్పాలి. అప్పటిదాకా ఉమ్మడి ఏపీ మొత్తానికి కూడా పెద్దగా తెలియని జీవన్ రెడ్డి, వైఎస్

**పుణ్యమా అని రాష్ట్రస్థాయి నేతగా ఎదిగారు.**

వైఎస్ కేబినెట్ లో సత్తా కలిగిన మంత్రిగా పేరు సంపాదించుకున్నారు. ఇక తన నియోజకవర్గ ప్రజల సమస్యల కోసం పోరాటంలో ఎంతదాకా అయినా వెళ్లే జీవన్ రెడ్డి వైఖరి అందరినీ ఆకట్టుకుందనే చెప్పాలి. వెరసి జీవన్ రెడ్డి క్లీన్ ఇమేజీ బీఆర్ఎస్ కు ఓ మోస్తరుగా ఉపయోగపడవచ్చన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

## జగిత్యాల తర్వాత జనంలోకి కేసీఆర్

లంచ్‌కు కేసీఆర్ ఆహ్వానించారు. ప్రస్తుతం పీసీసీ అనేది కేవలం సీఎం ఆదేశాలను అమలుచేసే ఒక విభాగంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పీసీసీ చేసే తప్పులకు చివరకు ఏఐసీసీని నిందించడం సరికాదని హితవు పలికారు. పార్టీ మాత్రమే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తోందని విశ్లేషించారు. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎం దుకు వెళ్తున్నానో మీకేతెలియాలంటూ కాంగ్రెస్ నేతలకు చురకలు అంటించారు. మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు అని అన్నారు.. రెండో సంవత్సరం 1 లక్ష ఉద్యోగాలు అని అన్నారు, ఏమైంది? అని ప్రభు త్వాన్ని నిలదీశారు. పదవుల కోసమే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాలంటే తాను ఆరోజే వెళ్ళేవాడినని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందుకు, ప్రజల పక్షాన పోరాడేందుకు తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించు కున్నానని జీవన్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ పెట్టి కేసీఆర్ సమక్షంలో తాను బీఆర్ఎస్‌లో చేరుతానని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. దాదాపు 5 గంటలపాటు కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా రావాలని జీవన్‌రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సాను కూలంగా స్పందించారని సమాచారం.

# పెళ్లి పేరుతో వల.. రూ.1.5 కోట్ల కట్నం డీల్.. చివరికి కటకటాల్లోకి!



మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో పరిచయమై, తాను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినని నమ్మించి ఓ యువతి కుటుంబాన్ని మోసం చేయబోయిన వ్యక్తి కటకటాల పాలయ్యాడు. పెళ్లి పేరుతో రూ.1.5 కోట్ల కట్నం డిమాండ్ చేసి, నిశ్చితార్థం కూడా చేసుకున్న ఈ కేటుగాడి బండారం ప్రీ-వెడ్డింగ్ షూట్ పేరుతో జరిగిన వేధింపులతో బయటపడింది. ఈ ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. హైదరాబాద్‌కు చెందిన పనస మధు (30) ప్రముఖ మ్యాట్రిమోనీ సైట్‌లో నకిలీ వివరాలతో ప్రొఫైల్ సృష్టించాడు. తాను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్-3 టెక్నికల్ మేనేజర్‌గా చర్లపల్లిలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఈ క్రమంలో నల్గొండకు చెందిన ఓ యువతి ప్రొఫైల్ చూసి ఆమెను సంప్రదించాడు. మాటలతో నమ్మించి, ఆమె కుటుంబాన్ని కలిసి పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. తన ఉద్యోగాన్ని నిరూపించేందుకు నకిలీ ఐడీ కార్డు కూడా చూపించడంతో వారు నిజమని నమ్మారు. యువతి కుటుంబం ఆర్థికంగా స్థితిమంతులని గ్రహించిన మధు, తొలుత రూ.2 కోట్ల కట్నం డిమాండ్ చేశాడు. చివరకు ఇరు కుటుంబాల మధ్య చర్చల అనంతరం రూ. కోటిన్నరకు ఒప్పందం కుదిరి నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే, ఇటీవల ప్రీ-వెడ్డింగ్ షూట్ పేరుతో యువతిని హైదరాబాద్‌లోని చైతన్యపురిలో ఉన్న ఓ గదికి పిలిపించిన మధు, ఆమెను అనుమానిస్తూ తీవ్రంగా వేధించాడు. అతని ప్రవర్తనతో భయపడిన యువతి, ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దీంతో అనుమానం వచ్చిన వారు మధు ఉద్యోగం గురించి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. అతను ఉద్యోగి కాదని తేలడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు మధును ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# పటాన్‌చెరు మార్కెట్ కమిటి సన్మాన సభ

**మంత్రులతో కలిసి పాల్గొన్న నీలం మధు..**

**సీ ఎస్ ఆర్ నిధుల అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్..**

**నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి సహకరించాలని వినతి..**

**ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ వద్ద మంత్రి వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికిన నీలం..**



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్ చెరు నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పటాన్ చెరు మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సన్మాన సభకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి తో కలిసి నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు నూతన వ్యవసాయ కమిటీ చైర్మన్ శివానందం, వైస్ చైర్మెన్ రాజశేఖర్ మరియు కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని మరోసారి రుజువైందన్నారు. తన సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని మోసం చేసి తిరిగి వెళ్ళాడని విమర్శించారు. నియోజకవర్గ సిఎస్ఆర్ నిధులపై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే గత పన్నెండు సంవత్సరాలలో జరిగిన నిధుల గోల్ మాల్ పై సమాధానం చెప్పాలన్నారు. పన్నెండేండ్లుగా జరిగిన సిఎస్సార్ నిధుల అవకతవకలపై విచారణ జరపాలని మంత్రి వివేక్ కు విజ్ఞప్తి చేశారు. పటాన్ చెరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికై సహకరించాలని కోరారు, ఈ సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు జాతీయ రహదారి నుండి లక్డారం- బ్యాతోల్, బ్యాతోల్ -రుద్రారం, తదితర రహదారుల దుస్థితి పై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి అన్ని రహదారులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు,

ఈ కార్యక్రమంలో టీ జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కాట సుధా, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు..



## ఆలయాలు ఆధ్యాత్మికత కేంద్రాలు

**నూతన దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం**

**పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

అమీన్పూర్ : ఆలయాలు మనసుకు శాంతి, ఆత్మకు ఆహ్లాదం, జీవనానికి దారి చూపే ప్రదేశాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని నవ్య రోడ్డులో శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం వేద పండితుల సమక్షంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన దేవాలయం నిర్మాణానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు గోపాల్, ఉపేందర్ రెడ్డి, బాలరాజు, రాములు, దాసు, రుశ్వంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## ప్రీమియర్ లీగ్ సీజన్-4లో రామ్ సేన విజయం

**నగదు బహుమతులు అందజేసిన గాయరు విశ్వనాథం**

హైద్రాబాద్ (వాయిస్ టుడే):డివిజన్ అంకుషాపూర్‌లో ప్రీమియర్ లీగ్ సీజన్-4లో టీం రామ్ సేన అద్భుత ప్రదర్శనతో రెండోసారి విజేతగా నిలిచింది. 12 ఓవర్లలో 118 పరుగుల లక్ష్యాన్ని కేవలం 7.3 ఓవర్లలోనే ఛేదించి, సిక్సల వర్షంతో ప్రేక్షకులను అలరించింది. ఈ టోర్నమెంట్‌ను ఏసిఎల్ నిర్వాహకులు నితీష్ రెడ్డి మరియు మధు గౌడ్ విజయవంతంగా నిర్వహించారు. విజేతగా నిలిచిన రామ్ సేన జట్టుకు ప్రైజ్ మనీగా ?15,000 రూపాయలు స్పాన్సర్ విశ్వనాథ్ చేతుల మీదుగా అందించారు. రన్నరప్‌గా నిలిచిన అంకుషాపూర్ టైటాన్స్ జట్టుకు ?10,000 నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో గుని, గిరిబాబు, బిల్లా, పూస భాను. క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## యాదాద్రి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు విజేతలు



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాలలో యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. వార్షిక పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల యాదగిరిగుట్ట విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మంచి ఉత్తీర్ణత సాధించారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మంజుల మేడం మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 74 మంది పరీక్షకు హాజరు కాగా 66 మంది ఉత్తీర్ణులు అయ్యారు అని తెలియజేస్తూ కళాశాల ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత శాతం 89.19 శాతం గా ఉందని తెలియజేశారు. అదేవిధంగా ప్రథమ సంవత్సర విద్యార్థులు 89 మంది పరీక్షకు హాజరు కాగా 41 మంది ఉత్తీర్ణులు అయ్యారని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచి మంచి మార్కులతో టాపర్ గా నిలిచిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను అభినందించారు అదేవిధంగా కళాశాలకు మంచి ఉత్తీర్ణత శాతం తీసుకురావడానికి కృషి చేసిన అధ్యాక బృందాన్ని అభినందించారు అదేవిధంగా కళాశాలలో ఫెయిల్ అయినటువంటి విద్యార్థులకు పరీక్ష రుసుము చెల్లించడానికి ఏప్రిల్ నెల 20 వ తేదీ చివరి తేదీ అని అలాగే సప్లమెంటరీ పరీక్షలు వచ్చే నెల మే 13 నుంచి ప్రారంభమైతాయని తెలియజేశారు.

# సీఎస్ఈలో ఫాతిమాకు పీహెచ్.డీ.



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పరిశోధక విద్యార్థి సయ్యదా ఇమ్రానా ఫాతిమా ఖవాజా జకియుల్లా ఖ్యాద్రి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సురక్షిత చిత్ర స్టెగానోగ్రఫీ కోసం ఒక ఉత్పాదక ప్రతికూల నెట్ వర్క్'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. యుగంధర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. వినూత్న డీప్ లెర్నింగ్ పద్ధతుల ద్వారా సురక్షిత డేటా ప్రసారాన్ని మెరుగుపరచడంపై ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. ప్రస్తుత స్టెగానోగ్రాఫిక్ పద్ధతులలోని కీలక పరిమితులను పరిష్కరిస్తూ, శిక్షణ స్థిరత్వాన్ని పెంచే, ఎంబెడింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే, దాగి ఉన్న సమాచారాన్ని విశ్వసనీయంగా వెలికితీసేలా చూసే పటిష్టమైన కూచీ-ఆధారిత ఫ్రేమ్ వర్కుల శ్రేణిని ఈ అధ్యయనం ప్రతిపాదిస్తుందని వివరించారు. గేమ్ థియరీ, డీప్ కన్వల్యూషనల్ నెట్ వర్కులు, సైకిల్ కన్సిస్టెన్సీ లెర్నింగ్, ఆప్టిమైజేషన్ వ్యూహాలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ పరిశోధన ఇమేజ్ స్టెగానోగ్రఫీ సిస్టమ్ ల భద్రతను, గుర్తించలేనితనాన్ని, ప్రతికూల దాడులు, డేటా నష్టానికి వ్యతిరేకంగా వాటి స్థితిస్థాపకతను గణనీయంగా బలపరుస్తుందని పేర్కొన్నారు. సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే మెరుగైన దృశ్య నాణ్యత, గుర్తింపును నిరోధించే పటిష్టత, సురక్షితమైన డేటా పునరుద్ధరణ వంటివి ఈ పరిశోధన ఫలితాలలో కనబడుతున్నాయన్నారు. ఇవి మరింత సురక్షితమైన, విశ్వసనీయమైన డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలకు దోహదపడతాయని తెలిపారు. డాక్టర్ సయ్యదా ఇమ్రానా ఫాతిమా సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## కీసరలో అంబేద్కర్ జయంతి వేడుకలకు ఎంపి ఈటలకు అహ్వానం

నాగారం, ఏప్రిల్ 12:-(వాయిస్ టుడే) కీసరలో ఈ నెల 14 నిర్వహించే భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలకు హాజరు కావాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ కు పురస్కరించుకుని కీసర మండల అంబేద్కర్ సంఘం ఆదివారం కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, బాధ్యులు పాల్గొన్నారు.



## పాన్ దుకాణాలు తనిఖీ చేసిన కీసర పోలీసులు

నాగారం, ఏప్రిల్12:-(వాయిస్ టుడే)మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధి కీసరలో పాన్ షాపులపై పోలీసులు శనివారం రాత్రి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. పాన్ దుకాణాలలో గంజాయికి సంబంధించిన వాటిని ఏమైనా విక్రయాలు జరుగుతున్నాయా అని వారు తనిఖీలు చేసారు. సిఐ ఆంజనేయులు, ఎస్ఐ లు హరిప్రసాద్, నాగరాజు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. పాన్ షాపుల్లో మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.




## నేరాలు అరికట్టేందుకు కాలనీ అసోసియేషన్ కలిసి పనిచేయాలి

నాగారం, ఏప్రిల్ 12:-(వాయిస్ టుడే)మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారం, రాంపల్లి డివిజన్‌లో కాలనీలన్నీ కలిసి కాలనీలలో నేరాలు అరికట్టడానికి కలిసికట్టుగా పనిచేయాలని కీసర ట్రాఫిక్ సిఐ శివశంకర్ కోరారు. నాగారం, రాంపల్లిలలో ఆల్ కాలనీ అసోసియేషన్‌గా ఏర్పడటం అభినందనీయమన్నసరు. ఆదివారం జరిగిన ఆల్ కాలనీ నూతన అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సత్యవతి, కాంగ్రెస్, బిజెపి నేతలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాలనీలు కలిసి జెఎసిగా ఏర్పడటం అభివృద్ధికి దోహదపడుతుందని వారు తెలిపారు.



## పటాన్‌చెరులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఘన సన్మాన సభ

**మంత్రుల సమక్షంలో మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం**

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు మార్కెట్ ప్రాంగణంలో ఘనంగా సన్మాన సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ౨+××జ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని, మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు. నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీకి చైర్మన్ శివానందం, వైస్ చైర్మన్ రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా బిక్షపతి, మైపాల్, నాగరాజు, నర్సింలు, బాలరాజ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, సతీష్ కుమార్ గౌడ్, ఇమ్రాన్, సునీత, హమీద్, సామయ్య, మల్లయ్య, గోపాల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు

హైదరాబాద్: ఏప్రిల్ 12;( వాయిస్ టూ డే): జ్యోతిబాపూలే 199వ జయంతి ఉత్సవాలు జైస్వాల్ గార్డెన్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలు కలిసి జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జైస్వాల్ గార్డెన్ కాలనీ ప్రెసిడెంట్ మదు సత్యం గౌడ్, వైస్ ప్రెసిడెంట్ పి కృష్ణ, జనరల్ సెక్రెటరీ నోముల స్వామి గౌడ్, చైర్మన్ వల్లభ, ట్రెజరర్ రాములు యాదవ్, ఈశ్వరయ్య ,కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ డిస్టిక్ కార్యదర్శి మట్ట శాంతమ్మ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.






## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటుకున్న వసుంధర కళాశాల

నాగారం, ఏప్రిల్ 12:-(వాయిస్ టుడే): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా సర్కిల్ ఈసీఐఎల్ పరిధిలోని వసుంధర జూనియర్ కళాశాల ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది. కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో ప్రత్యేక స్థానం సంపాదించారు. అధిక ఉత్తీర్ణత శాతం నమోదు చేయడంతో పాటు పలువురు విద్యార్థులు ఉన్నత మార్కులతో మెరిశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి సంబరాలు జరుపుకుంటూ దుందిబి మ్రోగించారు. పరస్పరం మిఠాయిలు పంచుకుంటూ విజయాన్ని ఆనందంగా మార్చుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మంచికంటి నిరంజన్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం ఈ విజయానికి కారణమని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ, పరీక్షా విధానాలు, సందేహ నివృత్తి తరగతులు నిర్వహించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, పోటీ పరీక్షలకు అవసరమైన దృక్పథాన్ని అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈసీఐఎల్, కుషాయిగూడ, ఏఎస్ రావునగర్, కీసర ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా వసుంధర కళాశాల నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలుస్తూ ప్రతి సంవత్సరం మెరుగైన ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు.



## రామంతాపూర్ పరిధిలోని గణేష్ నగర్ వద్ద "మహాదేవ్ ఫుడ్ కోర్ట్"ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- రామంతాపూర్ పరిధిలోని గణేష్ నగర్ వద్ద "మహాదేవ్ ఫుడ్ కోర్ట్"ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రాంతీయ వ్యాపారాల అభివృద్ధికి ఇలాంటి ఫుడ్ కోర్టులు దోహదపడతాయని తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. మహాదేవుని ఆశీస్సులతో ప్రారంభమైన ఈ ఫుడ్ కోర్ట్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని లిఖిత్, వెంకటేష్, నరగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫలితాల్లో పల్లెటూరి విద్యార్థిని



వాయిస్ టుడే / యాదగిరిగుట్ట : తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం రోజు ఉదయం తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఫలితాలను విడుదల చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కొంగరి.నవ్య శ్రీ సెకండ్ ఇయర్ లో 993/1000 SR కాలేజీ నుండి అత్యధిక మార్కులు సాధించింది ఇందుకు తన తల్లిదండ్రులు కొంగరి బిక్షపతి జయదేవిలు సంతోషం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండవ సంవత్సరం ఫలితాలు ఎక్కువ శాతం విద్యార్థినులు ఉత్తీర్ణులు అయ్యారు గ్రామాల నుండి వచ్చిన విద్యార్థినులు ఉత్తీర్ణులు కావడం చర్చనీయాంశం అని గ్రామస్తులు చెబుతున్నారు.

## అంజయ్య నగర్ బస్తీలో పూర్తిస్థాయి కమిటీ ప్రకటన



జూబ్లీహిల్స్ 12 ఏప్రిల్ వాయిస్ టుడే ): రహేమత్ నగర్ డివిజన్ టి.అంజయ్య నగర్ ఫస్ట్ ఫేజ్ బస్తీలోని ఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో బస్తీ ప్రజల సమక్షంలో పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. ఇటీవల బస్తీ ప్రజల ఓటింగ్ ద్వారా ఎన్నికైన పూస అండాలు బస్తీ అధ్యక్షురాలిగాబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బస్తీలోని పెద్దలు సమావేశమై కమిటీపై తీర్మానం చేశారు.కమిటీ సభ్యులు. .సలహాదారులు: వి. రాజేష్, పి. అంజయ్య, వై. యాదయ్య, జి. డేవిడ్ వర్కింగ్ ప్రెసిడెంట్లు: బి. మహేష్, ఎండి. మాజిద్, ఎం. మనోజ్ వైస్ ప్రెసిడెంట్లు: ఎం. క్రిస్టఫర్, సిహెచ్. నాగరాజు కోశాధికారి: జి. రాంబాబు జాయింట్ సెక్రటరీలు: ఎస్.డి. సాబేర్, గోవిందు వర్మ, ఎస్. రమేష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు: కే. బాబు, ఎం. మల్లప్ప, ఏ. మహేష్, ఎం. యాదగిరి, బి. భాస్కరాచారి, ఎస్.కె. కుర్షిత్ ఈ కమిటీని బహిరంగంగా బస్తీ ప్రజల సమక్షంలో నామినేట్ చేసి అధికారికంగా ప్రకటించారు.




# ఆత్మరక్షణకు కరాటే చక్కటి సాధనం




హైదరాబాద్, ఏప్రిల్ 12: ఆత్మరక్షణ కోసమే కాదూ.. ఆరోగ్యానికి 'కరాటే' చక్కటి సాధనంగా ఉపకరిస్తుందని సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే తెలంగాణ అసోసియేషన్ చైర్మన్ స్మిత బెన్ అన్నారు. సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ను ఆదివారం హిమాయత్ నగర్ లోని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్లో ఇండియా స్టైల్ చీఫ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ కోయోషి సిద్దార్థ్ షా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు నిర్వహించారు. కట్టా, అటాక్స్, కిక్స్, బ్లాక్, పంచ్, వెపన్స్, స్పైరింగ్స్ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తీర్ణత సాధించిన 38 మంది విద్యార్థులకు కలర్ గ్రేడింగ్ బెల్టులతో పాటు సర్టిఫికెట్స్ ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ బి. నాగరాజు, ఎగ్జామినర్ నవీన్ నాయక్, సెన్సెయి రచన, సెన్సెయి విశ్వత, తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందచేత

హైదరాబాద్ 12 ఏప్రిల్ (వాయిస్ టుడే ): దారుస్సలాం హెడ్ క్వార్టర్స్ లో జరిగిన కార్యక్రమంలో నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ (జవీ=ఖీ) చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ హాజరయ్యారు. ఎంఐఎం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీ డివిజన్, జూబ్లీహిల్స్ శాఖ అధ్యక్షుడు షేక్ జాఫర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంనిర్వహించబడింది. ఈ సందర్భంగా సయ్యద్ ఆసిఫ్ భాయ్, మొహమ్మద్ జహంగీర్, మొహమ్మద్ హబీబ్, రఫీక్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం సహాయ నిధి చెక్కులు నాలుగు మంది లబ్ధిదారులకు అందజేయబడ్డాయి: మొహమ్మద్ షాబాజ్ నూరి సుల్తానా ఆస్మా బేగంనజుమాన్ బేగం ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి మరియు కార్యక్రమనిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ పాసైన విద్యార్థులకు రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్





హైదరాబాద్, ఏప్రిల్ 12: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పాస్ అయిన విద్యార్థులకు కంప్యూటర్ ఎడ్యుకేషన్ మెరిట్ స్కాలర్షిప్ ప్రోగ్రాం కింద వివిధ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సులు ఆన్ లైన్‌లో నేర్చుకునేందుకు రూ.1లక్ష వరకు కోర్సు ఫీజులో రాయితీ ఇస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఇంటర్ మార్క్స్ గ్రేడింగ్ ఆధారంగా రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్‌కు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ స్కాలర్ షిప్ ప్రోగ్రాం కొరకు అభ్యర్థులు ఆన్ లైన్ వెబ్ సైట్: www.nationalskillacademy.in ద్వారా ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9505800047.

## సుప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే మృతి పట్ల ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సంతాపం



హైదరాబాద్: సుప్రసిద్ధ గాయకురాలు, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఆశా భోంస్లే మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆమె తన మధురమైన గాత్రంతో, పాడిన అమర గీతాలతో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారని ఎంపీ రవిచంద్ర తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. తెలుగు సినిమాలలో కూడా ఆమె ఆలపించిన పాటలు ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు. ఆమె మరణం భారత సంగీత రంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఉప్పల్ డివిజన్ న్యూ శాంతినగర్‌లో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో భారీ సంఖ్యలో చేరారు. పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీ లొ న్యూ శాంతినగర్ అధ్యక్షులు లక్ష్మయ్య ,జనరల్ సెక్రటరీ సైదులు, ఉపాధ్యక్షులు పరశురామ్, జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్,మాజీ అధ్యక్షులు లకన్,మాజీ అధ్యక్షులు గంట చంద్రశేఖర్ రెడ్డి గారు,, మెంబెర్స్ మత్స్యగిరి, యాదగిరి, ఉదయ్, నర్సింహా, మల్లయ్య, కృష్ణ, దర్శన్, ఉప్పలయ్య,మారయ్య, రాజు, సోమయ్య, సాయికుమార్, సత్తయ్య, శివ జనార్దన్, కిష్టయ్య, సుదర్శన్,పూరషోత్తం ఉప్పల్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, వెంకటేష్ గుప్తా,అలుగుల అనీల్ కుమార్,జనగాం రామకృష్ణ,అల్వాల భాస్కర్,నోముల సురేష్,మోహన్ నాయక్,రంగుల శేఖర్, శివ,ధనలక్ష్మి,భవాని,మమత రాణి,ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్‌కోటా లేకుంటే సాధికారత అసంపూర్ణమే

## ప్రధానికి గుజ్జ సత్యం లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 12: మహిళా రిజర్వేషన్ బిల్లుపై దేశవ్యాప్తంగా చర్చలు మళ్లీ ఊపందుకుంటున్న వేళ, బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కల్పించాలంటూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను అమలు చేసే క్రమంలో సామాజిక న్యాయం ప్రతిబింబించకపోతే, అది కేవలం పరిమిత వర్గాలకే లాభించే అవకాశముందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో బీసీలు సగానికి పైగా ఉన్నప్పటికీ, పార్లమెంట్, శాసనసభల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగానే కొనసాగుతున్నదని సత్యం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్పష్టమైన వాటా లేకపోవడం, చట్టం లక్ష్యమైన సమగ్ర సాధికారతను దెబ్బతీసే ప్రమాదముందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా బీసీ మహిళలు ద్విగుణితంగా వెనుకబడిన వర్గంగా ఉండటంతో, వారికి ప్రత్యేక రక్షణ లేకుండా సాధారణ కోటాలో పోటీకి నెట్టివేయడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ అమలును జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో అనుసంధానం చేయడంతో అమలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బిల్లులో సవరణలు చేయడానికి ఇదే సరైన సమయమని సత్యం తన లేఖలో సూచించారు. లేకపోతే, మరోసారి బీసీ మహిళలు రాజకీయంగా వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరిగిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, అదే నమూనాను శాసనసభలు,



పార్లమెంట్‌లో కూడా వర్గాల వారీగా అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. సామాజిక సమానత్వం సాధించాలంటే, బీసీ మహిళలకు జనాభా ప్రాతిపదికన సబ్‌కోటా కల్పించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ముందు ఈ అంశం రాజకీయ అజెండాలోకి రావడం గమనార్హమని, అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు, మహిళా సంఘాలు ఉద్యమాన్ని ఉధృతం చేసే అవకాశాలు ఉన్నాయని సూచించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకమవ్వాలంటే అది అన్ని వర్గాల మహిళలకు న్యాయం చేయాలి. బీసీ మహిళలకు తగిన స్థానం లేకుండా అది సంపూర్ణం కాదు" అని గుజ్జ సత్యం తన లేఖలో స్పష్టం చేశారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
తెలుగు దినపత్రిక



# విద్యుత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## కార్మికులసమ్మెకు మాజీ మంత్రి ఎర్రబెల్లి మద్దతు



తొర్రూరు, ఏప్రిల్ 12 వాయిస్ టుడే : విద్యుత్ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మద్దతు తెలిపారు. విద్యుత్ కార్మికుల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వ హయంలో విద్యుత్ కార్మికులకు జీఓ నెం 11 తీసుకొచ్చి ఆర్టిజన్లుగా గుర్తించి రెగ్యులర్ జీతాలు ఇచ్చి వారి కుటుంబాలను కెసిఆర్ ఆదుకున్నాడన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను తొలగించారని గుర్తు చేశారు. విద్యుత్ కార్మికుల సహకారంతోనే రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇచ్చి రైతాంగాన్ని కెసిఆర్ ఆదుకున్నాడన్నారు. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్లో అన్‌మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిసన్లుగా విలీనం చేయాలని కోరారు. అలాగే 2016కు ముందు అర్హతలు కలిగి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిసన్లుగా గుర్తించాలని, పీస్ రేట్ కార్మికులకు జీవో నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 24 వేల మంది కాంట్రాక్ట్ పద్ధతిలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయాలన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులు సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, టీజీఎన్పిడిసిఎల్ కంపెనీ చైర్మన్ ధరావత్ సికిందర్, మహబూబాబాద్ జిల్లా కోకన్వీనర్ మచ్చ సతీష్, డివిజన్ చైర్మన్ పసుపులేటి మధు, బందారపు శీను, నాగరాజు, ఖాజాబీ, సునీల్ కుమార్,జ్యోతి,స్వప్న, చంద్ర ప్రకాష్, సుభాష్, ఉపేందర్, రామకృష్ణ, సందీప్, శ్రీరామ్, నారాయణ, రవి, నవీన్, భూపాల్, ఎలా గౌడ్, అనుమ్య,విద్యుత్ శాఖ ఉద్యోగులు,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలపై హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 12: ఆదివారం విడుదలైన పరీక్ష ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు ఘనమైన ప్రతిభ కనబరిచారని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మొదటి సంవత్సరం 62.93 శాతం ఉత్తీర్ణతతో 12వ ర్యాంకు. ద్వితీయ సంవత్సరంలో 73.43 శాతం ఉత్తీర్ణతతో 13వ స్థానంలో నిలిచారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. తీనులైన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందకుండా మరింత కష్టపడి చదివి విజయం సాధించాలని సూచించారు

## స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన నిర్మల్ విద్యార్థిని అభినందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 470 కి 469 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. అదేవిధంగా రెండవ సంవత్సరంలో కూడా మంచి మార్కులు సాధించాలని మీకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అక్షయ తల్లిదండ్రులు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ పాల్గొన్నారు




## ముధోల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా సునీల్ ఎన్నిక

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా ముధోల్ మండలం షూట్ క్లబ్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనది జిందె సునీల్ అధ్యక్షుడిగా రైస్ కాన్ ప్రధాన కార్యదర్శిగా దొంతుల రమేష్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్ మల్లేష్ ఉపాధ్యక్షులుగా శరత్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో దుర్గ ప్రసాద్ మురళి గౌడ్ సహా పలువురు విలేకరులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ముధోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కోశాధికారి సంయుక్త కార్యదర్శి సభ్యులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఝరాసంగం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, యువ నేత ఉదయ్ శంకర్ పాటిల్



వాయిస్ టుడే ఝరాసంగం ఏప్రిల్ 12: ఝరాసంగం మండల పరిధిలోని భోజ్యా నాయక్ తండా, పూర్య నాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించబడ్డాయి. గ్రామానికి చెందిన శారదాబాయి (భర్త వాజీనాథ్) నిర్మించుకున్న కొత్త ఇంటి గృహ ప్రవేశాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, యువ నేత ఉదయ్ శంకర్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారురాలు శారదాబాయి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, యువ నేత ఉదయ్ శంకర్ పాటిల్ సంయుక్తంగా మాట్లాడుతూ... పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి చేయాలన్న సంకల్పం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సుభాష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సంగ్రామ్ పాటిల్, డప్పూరు సంగమేశ్, మారుతిరావు పాటిల్, వేణుగోపాల్ రెడ్డి, సయ్యద్ షకీల్, సర్పంచులు చింతల్‌గట్టు శివరాజ్, రవి పటేల్, రవీందర్, అమృత్, నాయకులు ఐ. నాగేష్, ఇస్మాయిల్, యేసయ్య అలాగే గ్రామస్తులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన గృహప్రవేశానికి హాజరైన బీసీ నాయకులు



వాయిస్ టుడే ఏప్రిల్ 12 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో: కామారెడ్డి జిల్లాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర బీసీ లెక్చరర్ అసోసియేషన్ అధ్యక్షులు కాముని సుదర్శన్ నేత నూతన గృహప్రవేశ కార్యక్రమం శుభప్రదంగా, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల ప్రాంతాల నుంచి పలువురు బీసీ నాయకులు హాజరై గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ వర్గాల హక్కుల సాధన, సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీలకు రావాల్సిన న్యాయమైన హక్కులు దక్కే వరకు సంఘటిత పోరాటం కొనసాగించాలని పేర్కొన్నారు. అలాగే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో బీసీలకు సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, మండల కేంద్రానికి చెందిన కుమ్మరి యాదగిరి, బీసీ సంఘం ఉపాధ్యక్షులు నీలకంటి సంతోష్, జుక్కల్ నియోజకవర్గ అధ్యక్షుడు చాకలి అశోక్ రాజ్, బీసీ సంఘం సభ్యులు నవీన్, రాజేందర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో తొర్రూరు విద్యార్థి గడల రాంచరణ్‌కు రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు



తొర్రూరు, ఏప్రిల్ 12 వాయిస్ టుడే : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్ష ఫలితాల్లో తొర్రూరు కు చెందిన గడల రామ్ చరణ్ బైపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించాడు. హనుమకొండలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రామ్ చరణ్ ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో బైపీసీ విభాగంలో మొత్తం 1000 మార్కులకు గాను 993 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో బైపీసీ విభాగంలో నాలుగవ ర్యాంకు దక్కించుకున్నాడు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో గడల రామ్ చరణ్ 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా ఇంటర్ ఫలితాల్లో హనుమకొండలోని ప్రతిభ జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయ దుందుభి మోగించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఎం అంజలి అనే విద్యార్థిని 994 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే జి కీర్తన అనే విద్యార్థిని 991 మార్కులు సాధించింది. ఇంటర్ పదవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఏ శ్రావణి అనే విద్యార్థిని 466 మార్కులు, వి తిరుపతి అనే విద్యార్థి 465 మార్కులు, ఈ తరుణ్ అనే విద్యార్థి 461 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ప్రతిభ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కళాశాల డైరెక్టర్లు కెఎల్ఎన్ ఆచార్య, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, శ్రవణ్ రావు, తిరుపతి తదితరులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభ కళాశాల ప్రత్యేకతను మరోసారి విద్యాలోకానికి చాటిచెప్పిన తమ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## చదువుల తోటలో వెళ్లి విరిసిన విద్యా కుసుమంలి

### గ్రామానికే వన్నెతెచ్చిన చదువుల తల్లి



వాయిస్ టుడే న్యూస్ మహబూబాబాద్): మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన పొనుగోటి.సతీష్,అర్చనల కూతురు సహస్ర శ్రీ పటేల్ ఈరోజు వెలువడిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సత్తా చాటింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన సతీష్‌కు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే చదువులో మొదటి నుండి ముందుండే కూతురు సహస్ర LKG నుండి 5వ తరగతి వరకు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదవగా ఆరవ తరగతి నుండి టెన్త్ క్లాస్ వరకు ప్రభుత్వ గురుకులంలో చదివారు గురుకులంలో చదివిన సమయంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన సహస్ర ని పలువురు ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు. ఇది గమనించిన సతీష్, అర్చనలు కూతుర్ని ఎలాగైనా ఉన్నత స్థాయిలో చూడాలని తమలాగే తమ పిల్లలు కష్టపడకూడదు అన్న ఉద్దేశంతో దృఢ సంకల్పంతో ఉన్న తండ్రికి అంది వచ్చిన అవకాశంలా హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం తమ కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులను ప్రాధేయపడ్డారు. అంది వచ్చిన అవకాశంలా భావించిన తండ్రికి తన కూతురు భవిష్యత్తే లక్ష్యంగా ఆ కళాశాలలో చేర్పించగా తన ప్రతిభకు మెరుగులు దిద్ది ఉన్నత చదువులు చదివి పై స్థాయికి వెళ్ళాలని భావించిన కాలేజీ యజమాన్యాన్ని కూడా అబ్బురపరిచి ఈరోజు వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మరోసారి తన ప్రతిభను కనబరిచి 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించి తను చదివిన కాలేజీ తో పాటు గ్రామానికి వన్నెతెచ్చిన సహస్ర శ్రీ పటేల్ ను కాలేజీ యజమాన్యంతో పాటు గ్రామస్తులు,బంధువులు పలువురు అభినందించారు.

## ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 466 మార్కులతో అమృత వర్షిణి ఉత్తీర్ణత

వాయిస్ టుడే ఏప్రిల్ 12 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో: తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలు--2026లో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆర్మూర్ అమృత వర్షిణి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ పరీక్షల్లో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 466 మార్కులతో పాస్ (గ్రా (గ్రేడ్) పొందిన ఆమె ప్రతిభను పలువురు అభినందించారు. విషయాల వారీగా ఇంగ్లీష్‌లో 78, సంస్కృతంలో 99, మ్యాథమెటిక్స్ IAలో 74, మ్యాథమెటిక్స్ IBలో 75, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 60, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో 20 మార్కులు సాధించింది. మంచి మార్కులు సాధించిన అమృత వర్షిణిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షాతిరేకాలతో అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ముదిగొండ కేజీబీవి విద్యార్థుల ప్రభంజనం ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థినులు

### విద్యార్థినుల కష్టం మరియు ఉపాధ్యాయుల కృషి వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి: స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర

ముదిగొండ మండలం ఏప్రిల్ 12 వాయిస్ టుడే: ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవి) 2025-2026 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

**అద్భుతమైన ఉత్తీర్ణత శాతం**

కళాశాలలో మొత్తం 118 మంది విద్యార్థినులు ఉండగా, 84.7 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సరం:లి 57 మంది విద్యార్థినులకు గాను 54 మంది ఉత్తీర్ణులై 93 శాతం ఫలితాలను నమోదు చేశారు. మొదటి సంవత్సరం:లి 61 మంది విద్యార్థినులకు గాను 46 మంది ఉత్తీర్ణత (75 శాతం) సాధించారు. ముఖ్యంగా రెండవ సంవత్సరం బైపీసీ విభాగంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం.

**మెరిసిన ఆణిముత్యాలు (టాపర్స్)**

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో డి. స్నేహ (975/1000) మరియు డి. శ్రావణి (972/1000) అత్యుత్తమ మార్కులతో కళాశాల కీర్తిని చాటారు. ఇతర టాపర్ల వివరాలు ఇలా ఉన్నాయి: రెండవ సంవత్సరం బైపీసీ పి. యామిని (869), టి. నవిక (858),మొదటి సంవత్సరం ఎంపీసీ: జి. శిరీష (433/470), జె. రేణుక (407/470),మొదటి సంవత్సరం బైపిసీ ఎం. పూజిత (356/440), ఎస్.కె. నజ్మా (336/440) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర మాట్లాడుతూ, విద్యార్థినుల కష్టం మరియు ఉపాధ్యాయుల కృషి వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థినులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 13 ఏప్రిల్ 2026



## నిరుపేద యువతి వివాహానికి ఎమ్మెల్యే బొజ్జపటేల్ చేయూత

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 12: నిర్మల్ జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద యువతి భీమనపల్లి నాగలక్ష్మి వివాహానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జపటేల్ వేడ్మా ఫౌండేషన్ ద్వారా రూపాయలు 10000 ఆర్థిక సహాయం అందించారు ఈ సహాయాన్ని అభినందిస్తూ నిరుపేద కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బొజ్జ పటేల్ సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్లాఉద్దీన్ సల్లు బాయ్ రేకుంట ప్రదీప్ గోల్కొండ రాజన్న కోవా శాంతయ్య అంకు ల్ గోల్కొండ రామన్న తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో జయకేతనం



నాగార్జునసాగర్, ఏప్రిల్ 12, వాయిస్ టుడే: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగార్జునసాగర్ విద్యార్థులు అత్యుత్తమ కనబరిచారని కళాశాల ప్రధానాచార్యులు దాసరి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో కళాశాల 82.76 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జనరల్ విభాగంలో మొదటి సంవత్సరంలో 64 మంది విద్యార్థులకు 20 మంది, ద్వితీయ సంవత్సరంలో 63 విద్యార్థులకు 48, వృత్తి విద్యా విభాగంలో మొదటి సంవత్సరంలో 49 మంది విద్యార్థులకు 42, ద్వితీయ సంవత్సరంలో 58 మందికి 48 చొప్పున ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

జనరల్ విభాగంలో గోన ఆర్యోక్త్ (ఎంపీసీ 947), కుమారి మధుమతి (బైపిసి 901), జటావత్ దత్తు (బైపిసి 898), కుమారి ఈ సాహితీ (ఎంపీసీ 889),కుమారి నేనవత్ చిట్టి (బైపిసి 877), మొదటి సంవత్సరంలో బి పార్థు (ఎంపీసీ 417) కుమారి లేఖన (బీపీసీ 414) కుమారి నికిత (బీపీసి 392), వృత్తివిద్య విభాగంలో శ్రీపాదం (ఓ ఏ945), సీమ (యం ఎల్ టి 941), మెండే మహేష్ (ఏ అండ్ టి 93), ఈ కళ్యాణి (ఏ అండ్ టి 923), కుమారి .దీప (జూ 921), తేజ (సి ఎస్ 918), మొదటి సంవత్సరంలో జగన్(ఏ అండ్ టి484), నర్సింగ్ వినయ్ (475),. బిందు (ఏ అండ్ టి 467, రాగి ప్రసన్న (ఎంఎల్టి 462) నాగేశ్వరి (ఓ ఏ457),ఎం సంతోష్ (ఏ అండ్ టి 450) చొప్పున మార్కులు సాధించారని తెలిపారు. కళాశాల విద్యార్థులు ఏ గ్రేడ్లు: 102, బి గ్రేడ్: 41, సి గ్రేడ్: 6, డి గ్రేడ్: 9 చొప్పున సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రధానాచార్యులు అధ్యాపకులు అభినందించారు.



## పేదవాడి ఇంట 'ఇందిరమ్మ' వెలుగులు

### గృహప్రవేశాల్లో లబ్ధిదారులతో కలిసి సందడి చేసిన విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఏప్రిల్ 12 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారికి ప్రభుత్వం తరపున నూతన వస్త్రాలను అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ."ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి అండగా ఉంటున్నాం. ఈ రోజు మల్కాపేటలో పలు కుటుంబాలు తమ సొంతింటి సంతోషాన్ని పంచుకోవడం ఆనందంగా ఉంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది," అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర కళాపరిషత్ ,పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

### పేదలకు దుస్తులు పంపిణీ భోజనకార్యక్రమం ఏర్పాటు



నాగార్జునసాగర్ ఏప్రిల్ 12 వాయిస్ టుడే : నాగార్జునసాగర్ లోని శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ వ్యవస్థాపకులు దండు నాగేశ్వరరావు పవర్ ఫౌండేషన్ వారితో కలిసి మాచర్ల పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో 50 మంది పేదలకు దుస్తుల పంపిణీ మరియు దుప్పట్లు పంపిణీ మరియు 50 మందికి భోజనాలను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ వ్యవస్థాపకులు జూనియర్ ఏఎన్ఆర్ డైరెక్టర్ ,నటుడు దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరమనే ఆయన అన్నారు సేవ చేస్తుంటే మనసుకు ఎంతో తృప్తి కలుగుతుందని అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాలకు హాజరైన వొడితల ప్రణవ్

- ఏళ్ల కల నెరవేరుతున్న తరుణంలో లబ్ధిదారులు భావోద్వేగం.
- హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట,కమలాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు.
- ఏప్రిల్ చివరి వారంలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు





హుజూరాబాద్ ఏప్రిల్ 12 (వాయిస్ టుడే): సొంతింటి కల అనేది ప్రతి పేదవాడి కల అని అలాంటి కలను కాంగ్రెస్ పార్టీ,రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేరుస్తుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం రోజున హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని హుజూరాబాద్,వీణవంక మండల పరిధిలోనీ వల్భాపూర్, జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం, కొత్తపల్లి, ఇల్లంద కుంట మండల పరిధిలోని కనగర్తి, కమలాపూర్ మండల పరిధిలోని లక్ష్మీపూర్,గోపాల్ పూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాలకు ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. జీవితంలో ఇళ్లు కట్టుకుంటామా లేదా అని ఆందోళన చెందామని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దశలోనే మాకు ఇళ్లు మంజూరు చేసిందని మా కలలకు జీవం పోసిన కాంగ్రెస్ పార్టీకి,ఇంచార్జి వొడితల ప్రణవ్ కు ప్రత్యేకంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు అర్హులైన ప్రతి పేదవాడి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని,ఏప్రిల్ చివరి మాసంలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుడుతున్నామని దీని ద్వారా మరింత మంది లబ్ధిదారులకు ఇల్లు కట్టుకోవాలనే కోరిక నెరవేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,మండల,పట్టణ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మైనారిటీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇస్కబావిగూడెంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

మాడ్గులపల్లి ఏప్రిల్ 12( వాయిస్ టుడే,) : మండలంలోనిఇస్కబావిగూడెంగ్రామంలో ఆదివారం అంబేద్కర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతరాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం విగ్రహదాతలు పాలుట్ల బాబయ్య, నిమ్మల నవీన్ రెడ్డి,చీతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు,గ్రామ పుర ప్రముఖులు అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, మహిళలు యువకులు రైతులు కులమతాలకు ఉచితంగా పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణం లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన భారత రాజ్యాంగాన్ని లిఖించి అణగారిన వర్గాల అభ్యున్నతి తోపాటు, సబ్బండ వర్గాల సంక్షేమం అభివృద్ధి హక్కుల సాధన కోసం బి.ఆర్ అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. భారత రాజ్యాంగంలో డా. బి.ఆర్ అంబేద్కర్ పొందుపరిచిన హక్కులు బాధ్యతలను తెలుసుకొని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. అందుకు సరైన మార్గం విద్యనేనని ప్రతి ఒక్కరు తమ పిల్లలకు ఆస్తులు అంతస్తులు ఇవ్వలేకపోయినా నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. విద్యతోనే మనందరి ఉద్యోగుల భవిష్యత్తు ఆధారపడి ఉన్నందున ప్రతి ఒక్కరు ఉన్నత విద్యావంతులై అంబేద్కర్ ఆశయ సాధనకు అంకితం కావాలని కోరారు.ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పోతురాజు.వెంకన్నఅధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో అంబేద్కర్ రీస్టులు, వక్తలు, అంబటి.నాగయ్య,మండల.ఆంజనేయులు,కాశమళ్ళ.నాగయ్య,భారత రాజ్యంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్, విగ్రహావిష్కరణ ఇసుకబావి గూడెం,కమిటి సభ్యులు, సామపెద్దవెంకన్న, మేడి.మలాకి,యెలిజాల యాదగిరి, పోతురాజు పెద్దప్రభాకర్, నామ.శంకర్, మేడి సుందర్, పోతురాజు యాదయ్య, వల్లపుదాసు పెద్ద అశోక్, గోలి.ప్రభాకర్, వల్లపుదాసు.చంద్రశేఖర్, వల్లపుదాసు నర్సయ్య,వల్లపుదాసు ప్రవీణ్,గోలి మదన్ కుమార్, గోలి సిద్దు,యెలిజాల అఖిల్, సామ.చిన్న వెంకన్న,రాములు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావుకు ఘనంగా సన్మానం

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఏప్రిల్-12 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ అభివృద్ధికి కోసం ఊర చెరువును మినీ ట్యాంక్ బండ్గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నుండి ఎనిమిది కోట్ల డెబ్బై ఏడు లక్షల నిధులు మంజూరు చేయించి, ఈ అభివృద్ధి పనులకు కృషి చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు శివపల్లి లోని తన నివాసంలో, మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించిన సుల్తానాబాద్ మున్సిపల్ పాలకవర్గం, ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ కౌన్సిలర్ లు గాజుల రాజమల్లయ్య, టీకే ప్రభాకర్, ఉట్ల వరప్రసాద్,గాదాసు రవీందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, అమిరి శెట్టి రాకేష్, దుగ్యాల సంతోష్ రావు, అమిరి శెట్టి తిరుపతి, తదితరులు ఉన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..

## గర్రెపల్లి మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థుల సత్తా -- ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రదర్శన

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఏప్రిల్-12 వాయిస్ టుడే : ఇంటర్మీడియట్ ఫలితాల్లో గర్రెపల్లి మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు.రెండవ సంవత్సరం ఎంపీసీ లో టీ, రక్షిత తొమ్మిది వందల అరవై ఎనిమిది, బైపిసి లో ఎస్.శిరీష 979, సిఇసి లో డి,సన్నిత 937 మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసి లో ఆర్, సాయి 462 బైపిసి లో ఆర్. కీర్తన 418 సిఈసి లో జి,వర్షిత 407 మార్కులు సాధించారు. వీరిని మోడల్ స్కూల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్,గోల్డి బాల్బీర్ కౌర్ అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు..

## నేటి నుండి కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

### క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి

### బి ఆర్ ఎస్ నాయకులు బోయిని రాజు



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఏప్రిల్ 12: బోయినపల్లి మండలం లో 11 ఎంపీటీసీ స్థానాల పరిధిలో కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం అవుతుందని బి ఆర్ ఎస్ నాయకులు బోయిని రాజు తెలిపారు.సోమవారం ప్రారంభం కాకున్నా మొదటి మ్యాచ్ ప్రారంభించేందుకు మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ హాజరవుతున్నారని తెలిపారు.మండలం లోని క్రీడాకారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా స్థాయిలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు

## బోయినపల్లి గ్రామ రజక సంఘ అధ్యక్షులుగా దుద్దెల లచ్చయ్య



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఏప్రిల్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో బోయినపల్లి గ్రామ ప్రజల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి గౌరవ అధ్యక్షులుగా గంగిపెల్లి మొండయ్య, అధ్యక్షులుగా దుద్దెల లచ్చయ్య, ఉపాధ్యక్షులుగా గంగిపెల్లి రాజశేఖర్,ప్రధాన కార్యదర్శిగా గంగిపెల్లి ముని,సంయుక్త కార్యదర్శి దుద్దెల ప్రవీణ్,కోశాధికారిగా దుద్దెల మల్లేశం,కార్యవర్గ సభ్యులుగా దుద్దెల మల్లేశం,దుద్దెల రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. సంఘ బలోపే దానికి తోడ్పడి సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుండాలని కోరారుద.

## 140వ మే డే కరపత్రాలు ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 12 (వాయిస్ టుడే) మే డే కరపత్రాన్ని ఏఐఎఫ్టియు న్యూ నాయకులు ఆవిష్కరించారు. ఏఐఎఫ్టియు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మే డే బహిరంగ సభ అధ్యక్షులు సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ, 1886 మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం గా జరుపు కొవడం జరుగుతుందన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి పాత బస్టాండ్,పెద్ద బజార్ మీదుగా శాంతినగర్ చౌరస్తా లోని ఏఐఎఫ్టియు న్యూ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ జరుపుటకు నిర్ణయించడం జరిగిందని ఇట్టి బహిరంగ సభ కు ముఖ్య అతిథి గా తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్,ఏఐఎఫ్ టి యు న్యూ రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా సైజింగ్ డయింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వొల్లాల కిషోర్,తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి బామాండ్ల రవీందర్,ఎర్ర జెండా బీడీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మచ్చ అన సూర్య, ఎర్రజెండా పవర్లూమ్ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గుజ్జ దేవదాస్, పి ఓ డబ్ల్యు రాష్ట్ర నాయకులు పెద్దోళ్ల సంగీత, తదితరులు పాల్గొన్నారు.

# జెపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేత

### ముఖ్య అతిధులుగా పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట ఏప్రిల్ 12 (వాయిస్ టుడే): జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో జమ్మికుంట ప్రీమియం లీగ్ (జీపీఎల్) విజేతలకు మొదటి బహుమతి డి ఎల్ ఎస్ మరియు రెండవ బహుమతి స్టేక్ 11 టీమ్ లకు స్థానిక శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి బహుమతి అందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా జే పి ఎల్ నిర్వాహకులు మరియు క్రీడాకారులను ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని,క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,జట్టు భావనను పెంపొందిస్తాయని తెలుపుతూ గెలుపు,ఓటములు సహజం, ఏవైనా రెండు జట్లు తలపడినపుడు ఒకరు ఓడిపోవడం ఒకరు గెలవడం సహజం ఓడిపోయిన వారు మరోసారి గెలుపు కోసం ప్రయత్నించాలి, ఆటను అటలాగే చూడాలి తప్ప వ్యక్తిగతంగా తీసుకోకూడదు అని తెలుపుతూ ప్రస్తుత యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ప్రస్తుత పరిస్థితులలో తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్రీడల పట్ల శ్రద్ధ చూపించి ఏదో ఒక క్రీడా పై నైపుణ్యత సాధించాలని తమను కన్న తల్లిదండ్రులపై గౌరవం చూపించాలని తెలుపుతూ ఇలాంటి టోర్నమెంట్లు స్థానిక ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

